

# అమెరికా అమ్మాయి

## - శ్రీనిధి యెల్లల



### ఒక చిన్న మాట..!!

ఈ సారి రెండు మూడు 'హీట్ వేవ్స్' తో సమ్మర్ ముగిసిపోతుందిలే అని అనుకుంటూ ఉండగా అకాలంగా వచ్చింది వర్షంలేని ఉరుములు మెరుపులతో ఒక 'డ్రై స్టార్మ్' (పొడి తుఫాను అనాలా?). అమెరికా వచ్చింది మొదలు ఇదే మొదటి సారి ఆ పేరు వినడం, వర్షం లేకుండా వచ్చే ఉరుములని మెరుపుల్ని చూడడం. ఒక్కసారిగా మారిపోయిన వాతావరణం నుండి తేరుకునే లోపే తను చేయవలసిన పని చేసేసి వచ్చినంత వేగంగా వెళ్ళిపోయింది ఆ తుఫాను. కాలిఫోర్నియా ఎండలకు బాగా ఎండి బంగారం పోతపోసినట్టుగా ఉండే కొండల మీది గడ్డి ఈ పిడుగులతో అంటుకుని కార్చిచ్చులా అడవులకి పాకింది. బే ఏరియాలో ముందెన్నడూ చూడనంతగా పొగ, బూడిద. ఇంట్లోంచి బయటకి వచ్చి గట్టిగా ఊపిరి పీల్చడానికి కూడా లేనంత పొగ. ఒక అయిదు రోజుల పాటు ఇబ్బంది పెట్టింది. ప్రకృతి తలచుకుంటే క్షణాల్లో ఎంత భయంకరంగా మారగలదో తెలిసివచ్చింది. ఏదో శక్తి సమన్వయం చేస్తున్నట్టు మెల్లిగా మళ్లీ మాములు స్థితికి వచ్చాము. అంతవరకూ పడ్డ ఆందోళన, భయం కూడా మాయమయ్యాయి ఆ పొగలాగానే.

అలవాటు ప్రకారం తెల్లవారి లేచిన వెంటనే వాట్స్ ఆప్ చూసుకున్నాను. ప్రపంచానికి నన్ను కలిపేది అదే కదా మరి. వాట్స్ అప్ మైంటైన్ చెయ్యడమే ఒక పెద్ద పని అయి కూర్చుంది ఈ మధ్య. వాట్స్ ఆప్ నిండా పుట్టినప్పటినుండి ఏర్పడ్డ పరిచయాలన్నీపెరిగిన చోటుని బట్టి, బంధుత్వాలని బట్టి, కలిసి చదువుకున్న సంవత్సరాలని బట్టి, పనిచేసిన చోటుని బట్టి, కొనుగోలు చేసే వస్తువులని బట్టి విడమరచి ఏర్పరచుకున్న రకరకాల గ్రూపులు. పుట్టి బుద్దెరిగి నేనెరిగిన వారిని ఒక్కరిని కూడా మిస్ అయ్యే అవకాశం నాకూ లేదు వారికీ లేదు. ఫేస్బుక్ లో ఉన్నవారే వాట్స్ అప్ లో, ఇంస్టా గ్రాంలో, ట్విట్టర్ లోను. నేనేం చేసినా ఎవరో చూస్తున్నారు, చూడబోతారు, చూడాలి అనే ఉద్వేగంలోనే తెలీకుండా గడిచిపోతోంది జీవితం.

వారందరి మెసేజీలు చూసి, తరువాత టిక్ టాక్ ఛాలెంజ్ కి ఏ కాన్సెప్ట్ చెయ్యాలో నుండి కొత్తగా మార్కెట్ లోకి వచ్చిన డైట్ ప్లాన్ వరకూ ఇలా తెలిసినా తెలియకపోయినా ప్రతి చర్చల్లో పాల్గొని, ఫార్వర్డ్ మెస్సేజీలు చూసి దడుచుకుని, మళ్లీ తెలివి తెచ్చుకుని వివేకంతో ఆలోచించి వాటిని మనసులోనే విస్మరించి, చదివినట్టు ఒక ఎమోజి పడేసి, ముఖ్యమైన మెసేజిలకు సమాధానాలు ఇచ్చి బయటపడేలోపు పూట గడిచిపోతోంది.

ఒకే ఒక సంవత్సరం మాతోపాటు అయిదో క్లాస్ చదివి ట్రాన్స్ఫర్ అయ్యి వెళ్ళిపోయిన పిల్ల కూడా స్కూల్ పేరు మీద ఉన్న గ్రూప్ లో చేరి నా డిస్ప్లే పిక్ చూసి పర్సనల్ గా మెసేజ్ పెట్టేసింది "కాస్త చూసుకో అప్పుడే ఇంత లావైపోతే ఎలా? టేక్ కేర్ ఆఫ్ యువర్ సెల్ఫ్" అని. చిర్రెత్తుకొచ్చింది నాకు.

మొత్తంగా చూసుకుంటే మూడు రోజుల పరిచయం లేని వారు కూడా ఫ్రెండ్స్ అయిపోయి, నెత్తికెక్కి సలహాలు ఇచ్చేసి నా జీవితాన్ని ఉద్ధరించేయ్యాలని చూసేవారే. ప్రతి వారూ గొప్ప వారే. అస్సలు బాధా–బెంగా, చీకూ–చింతా అనేవే ఎరుగని వారిలా నటించే వారే. బొమ్మ ఉన్నప్పుడు బొరుసు లేకుండా ఎలా? ఒకవైపు మాత్రమే తమ జీవితాలని నలుగురికి చూపిస్తూ ఎవరిని భ్రమింపచేయ్యాలని? ఎవరిని మోసం చెయ్యాలని? మనసులో మాట విని మౌనంగా 'నాకు తెలుసు. నాకు అర్థమవుతుంది' అనే నేస్తం ఒక్కరు చాలదూ?

ఇహ ఫామిలీ గ్రూప్ నస గురించి ఎంత తక్కువగా మాట్లాడుకుంటే అంత మంచిది. ఈ ఫామిలీ గ్రూప్ కి నాలుగు ఉపశాఖలు మళ్లీ ! అమ్మ గారివైపు ఒకటి, అత్తగారి వైపు ఒకటి, అటు వైపు ఇటు వైపు కసిన్స్ గ్రూపులు చెరొకటి, అందులో మా ఆడపిల్లలకి మళ్లీ ప్రత్యేకం ఒకటి...ఇలా! ఒక గ్రూపులో వారి గురించి ఇంకో గ్రూపులో చీల్చి చెండాడడం, ఏడిసారు వారి మొహం అని తీసిపారెయ్యడం ఇదే పని. పెళ్ళిళ్ళలో పేరంటాలలో సంవత్సరానికి నాలుగు సార్లు కలిసే వారు కూడా ఇప్పుడు చిటికెలో అందుబాటులో ఉన్నారా, ఇహ ఫామిలీ సర్కస్సు గురించి వేరే చెప్పాలా? ఒకరి గురించి చెప్పి మనం ఫోన్ పెట్టేసే లోపు స్క్రీన్ షాట్లతో సహా అవతల వారికి ఉప్పందించేస్తున్నారు.

మరీ పెద్దవాళ్లని చూస్తుంటే కోపం వచ్చేస్తోంది. ఏమి నేర్చుకోవాలి అసలు వీరిని చూసి. వెకిలి జోకులు, అర్ధం పర్ధం లేని వ్యక్తిత్వ వికాస సూక్తులు, రుజువుల్లేని చిట్కా వైద్యాల ఫార్వర్డ్ మెసేజిలు ఇవే ఎంత సేపు. పిల్లలు ఏమో కానీ ఇంటర్నెట్ వల్ల పెద్దలు కూడా అంతకు మించి చెడిపోతున్నారు.

ఇప్పుడో అప్పుడో జారి పోయేలా ఉండే  చీర కట్టుకుని పెదనాన్నతో కలిసి "నిన్ను చూసి పడిపోయా ఆన్ ది స్పాట్!" అని జయమాలిని లెవెల్ లో ఎక్స్ప్రెషన్స్ ఇచ్చే వరుస పెద్దమ్మ ఒకవైపు.

మోస గాళ్ళకు మోసగాళ్లు లో విజయలలిత లాగా ప్యాంటు వేసుకుని అన్నగారితో కలిసి "ఏయ్ చికీతా! గుమోస్తాస్!" అని మెలికలు తిరిగే వదిన గార్లు ఇంకో వైపు. వీడియో మెసేజిలు ఏమో గాని ఈ వికారాలు చూడలేక తల గోడకేసి బాదుకోవాలి అనిపిస్తోంది..

ఎలావస్తుంది వీరి మీద గౌరవం?

వీళ్ళని చూసి మరి కాస్త రెచ్చిపోయే చదువుకునే కజిన్స్. పారిస్ రాంప్ వాక్ మోడల్స్ లాగా ఆటిట్యూడ్ చూపించే పసి పిల్లలు. ఎక్కోసారి అసలు గుర్తు పట్టలేనంతగా మారిపోయిన వ్యవస్థని చూస్తుంటే నాకు నేనే రాతియుగం దానిలా తోస్తున్నాను. పోనీ ఏమైనా చెపుదామా అంటే 'బాడీ షేమింగ్', 'పెసిమిస్ట్', 'నారో మైండెడ్' అని నాకే తిరిగి బిరుదులు  అంటించేస్తున్నారు. రకరకాల మీమ్స్ తో, కొటేషన్లతో చెప్పీ  చెప్పక సెటైర్లు విసురుతారు.

మొహం నిండా పసుపు రాసుకుని రూపాయి కాసంత బొట్టు పెట్టుకోమని ఎవరూ చెప్పడం లేదు. ఎన్ని అవమానాలు, త్యాగాలు దాటుకుని ఇక్కడికి వచ్చామో బాగా తెలుసు మాకు. కానీ దొరికిన స్వేచ్ఛని ఇలా విచ్చలవిడిగా వాడేస్తూ ఆదిమానవుల్లో 'గుంపు సమాజం' వాళ్ల లాగా బతకాలా అని అనుమానం అంతే!

సోషల్ మీడియా మెల్లిగా ప్రైవసీ దోచేస్తోంది. అయిన వాళ్లు కాని వాళ్లు దగ్గర వాళ్లు దారిన పోయే వాళ్లు అందరూ అందులోనే. ఇంతకు ముందు ఏదైనా స్టేటస్ పెట్టినా, ఫోటో షేర్ చేసినా నాకు ఇష్టమైన, నాకు తెలిసిన వారి మధ్యే ఉండేది జీవితం. ఇప్పుడు

మరీ నా అంతట నేనే తెలీకుండా అందరి మధ్యలోకి వెళ్ళిపోయా. తీసుకోవలసిన మలుపు కాకుండా వేరే సందులోకి తిరిగి అనవు గాని చోట అడుగుపెట్టిన భావన. అధికులమని, అందలం ఎక్కామని చెప్పుకోవచ్చా?

చిన్నప్పుడు మనకి నచ్చిన వారితోనే మన స్నేహం ఉండేది. కాస్త బాధ పెట్టేవారు, తక్కువ చేసి హేళన చేసే వారికీ ఎంత దూరంలో ఉండాలో అంత దూరంలో ఉండేవాళ్ళం. ఇప్పుడేంటి ఇలా? తెలీకుండానే చిక్కుకున్నానా సాలెగూడులో? అర్థం కానీ ఆత్రం, ఆవేశం అలముముకుని ఉంటాఎందుకు ఎప్పుడూ? వాట్స్ అప్ నోటిఫికేషన్ టింగు మన్నపుడల్లా ఎందుకా ఝల్లుమనే అదురుపాటు ఎల్లవేళలా?

ఇలా ప్రపంచంలో ఉండే ప్రతి ఒక్కరితో నవ్వుతూ మన వర్చ్యువల్ స్పేస్ లో చోటు ఇస్తూ మొహమాటంగా సర్దుకుపోతూ ఉండాలా? ఇంత టెక్నాలజీ కనుక్కున్నది ఇందుకోసమేనా అని? సవాలక్ష సెట్టింగులు చేసుకుని, ఫిల్టర్లు యాడ్ చేసుకుంటే తప్ప మనశ్శాంతి ఉండేలా లేదు అనిపించింది.

ఇలా ఆలోచనల్లో ఉండగానే ఠింగుమంది ఫోను. క్షణంలో వెయ్యోవంతు సర్రున పాకిన 'డోపమైన్ లూప్' ని నియంత్రించేలోపే ఆత్రంగా ఫోన్ లాక్కుని చూసాను. 202 శ్వేత నుండి మెసేజ్. ఈ రోజు తన కార్ సర్వీస్ కిస్తానని చెప్పింది. కాబట్టి ఆ పిల్ల డాన్స్ క్లాస్ దగ్గర తనని దింపుతానని చెప్పాను. నిన్నో సారి గుర్తు చేసింది. మళ్లీ ఈరోజు. చెప్పేవాడికి, చేసే వాడికి అవతలి వాడు ఎప్పుడూ లోకువే కదా. సరే అని యధాలాపంగా నేను 'ఆన్లైన్' లో ఉన్నాను అని తనకు తెలుస్తుంది అని తెలిసినా పది నిముషాలు ఆగి రిప్లై ఇచ్చాను.

“ఎందుకు?”

ఏమో మరి!

నాకు అవసరం ఉన్నప్పుడు అందరూ అలాగే ప్రవర్తిస్తారు. ఏదో తప్పనిసరై, విలువైనది ఏదో దానం చేస్తున్నట్టు, దానికి మనం జీవితాంతం కృతజ్ఞతగా ఉండాల్సిందే అన్నట్టు నాలుగు సార్లు గుర్తు చేసి మరి కానీ ఏ చిన్న మాట సహాయం కూడా చెయ్యరు. నేను అలాగే ఉండాలి కదా మరి!

"ఎంత 'అబ్సర్డ్' గా ఆలోచిస్తున్నాను?" అని ఎక్కడినుండో లీలగా వస్తోన్న ప్రశ్నను విదిలించి పారేసి ఇన్స్టాలో ఏవో వీడియోలు చూస్తూ కూర్చున్నా.

మరో రెండు మెసేజిలు ఇప్పించుకున్నాక ఐదు నిమిషాల్లో పార్కింగ్ లో ఉంటాను అని చెప్పి పది నిమిషాల తరువాత ఇంట్లోంచి బయలుదేరాను. నేను తెలీకుండానే ఆనందిస్తున్నాను ఈ ప్రాసెస్ అంతా. నేను కార్ దగ్గరికి వెళ్లేసరికి రెడీ గా ఉంది శ్వేత. ముదురు ఆకుపచ్చ రంగుకి సన్నని బంగారు అంచున్న కుర్తి, నల్లని చున్నీ, జర్మన్ సిల్వర్ జుంకీలు. తీరుగా కాటుక పెట్టిన కళ్ళు. రెండు చేతులతో ఎడమ భుజానికి వేళ్ళాడుతున్న కలంకారీ హ్యాండ్ బాగ్ ని నలిపేస్తూ ఎదురుచూస్తూ ఉంది. ఒక్క చిన్న డీటెయిల్ కూడా మిస్ అవ్వలేదు నేను. ఎత్నిక్ ఇండియన్ బొమ్మలాగా ఉంది పిల్ల. 'భలే ఉన్నావ్!' అనాలి అనిపించినా పట్టించుకోనట్టు పద పద అని కార్ అన్ లాక్ చేసి బయలుదేరాము.

"ఎంత ఆత్మవిశ్వాసం పిల్లలో!" ... "ఆఁ ! భార్యా భర్త ఇద్దరూ జాబ్ చేస్తారు కదా.”

"బంగారు కొమ్మలా ఉంది " ... "ఇంకా పిల్లలు లేరు గా! "

"ఇరవై ఏడేళ్లకి మళ్లీ చిన్నప్పుడు వదిలేసిన నాట్యాన్ని నేర్చుకుంటోంది.” ....." సరేలే! అమెరికా వచ్చాక చుట్టాలు, చాకిరీ అన్ని తగ్గి తీరిక ఎక్కువ కదా. ఏదో ఒకటి చెయ్యకపోతే ఎలా తోచేది?"

ఇలా ఒకవైపు యాంత్రికంగా ఫార్మల్ గా మాట్లాడుతూనే, నిస్సంకోచంగా మనసులో జడ్జి చేసేస్తున్నాను శ్వేత గురించి. ముసుగులు తీసేస్తే ఎంత భయంకరమైన ఆలోచనలు కదా అందరివీ?

వాళ్ల డాన్స్ క్లాస్ దగ్గర శ్వేతని దింపేసి పక్కనే ఉన్న ఇండియన్ గ్రోసరీస్ కి వెళ్ళాను. రష్ ఎక్కువగా లేకపోడంతో త్వరగానే అయిపోయింది. పెద్దగా చేసే పని కూడా లేదు కాబట్టి శ్వేత వాళ్ల డాన్స్ క్లాస్ కి వెళ్ళాను. నేను తన కోసం ఎదురు చూసాను అని తనకీ తెలియాలి కదా అని. ఎప్పుడూ రమ్మని అడుగుతూ ఉన్నా వెళ్ళలేదు. చూద్దాం అనుకుంటూ వెళ్ళాను లోపలికి.

చిన్న గ్రూపే. ఎక్కువ మంది లేరు. అంతా కలిపి పదకొండు మంది అంతే. శ్వేత అప్పుడప్పుడు చెప్తూ ఉండడం వల్ల ఫొటోస్ చూసి ఉండడం వల్ల పోల్చుకున్నాను కొందరిని. అక్కడ గోడకి కూర్చుని కర్ర కొడుతూ సొల్లు కట్టు చెపుతున్న గురువు గారిని చూడగానే తెలీకుండానే నమస్కారం చేసి నిశ్శబ్దంగా ఒక మూలకి ఒదిగి కూర్చున్నాను. జడ్జి చేస్తూ ఇంకెవరైనా బుర్రలో ఏదో ఎడ్డెమ్ అంటే తెడ్డెమ్ గా అంటారేమో అని చూసా కానీ అప్పటికే అక్కడి వాతావరణంలో లీనం అయిపోయా.

చక్కగా గురువు గారు వేసే తాళానికి అనుగుణంగా లయబద్ధంగా అడుగులు కదుపుతూ చిన్నా పెద్దా ఆనందంగా సర్వం మరచి నాట్యం చేస్తూ ఉంటే చూడ ముచ్చటగా ఉంది. అక్కడే బృందావనం చూపిస్తున్నారు, వారే క్షణంలో గోపికలవుతున్నారు మరుక్షణంలో వారే కృష్ణుడిగా మారుతున్నారు. ప్రతి భావాన్నీ అనుభూతి చెందుతూ భావస్ఫూర్తితో రసనిష్పత్తి కలిగిస్తున్నారు. వాళ్ల మొహాల్లో తేటగా కనపడుతున్న ఆనందం. తెలీకుండానే ఆ ఆనందాన్ని నేను అందుకుంటున్నట్టు ఉన్నాను.

క్లాస్ అయ్యేసరికి వాతావరణంలో కూడా ఒకవిధమైన ఎనర్జీ నిండిపోయింది. శ్వేతతో కలిసి తిరిగి వస్తూ ఉంటే మళ్లీ ముసురుకున్న ఆలోచనలు. కానీ వితండంగా వాదించి నా ఇగో తృప్తి పరచినట్టు కాకుండా , నా ప్రశ్నలన్నిటికీ జవాబు వెతుక్కున్నట్లుగా ఉంది.

వాట్స్ ఆప్ లో నేను విసుక్కున్న మనుషులు ఇక్కడ డాన్స్ క్లాస్ లో నేను చూసిన మనుషులు అందరం ఒకే కాలమానంలో ఒకేలాంటి పరిస్థితుల మధ్యన, ఒకేలాంటి సుఖాలు, సౌకర్యాల చుట్టూ ఉన్నాము. కానీ మేము మాలో ఉండే ఎనర్జీని విడుదల చేసే మార్గాలు ఎంచుకోడంలో వేరు వేరుగా ఆలోచించాము అంతే.

సిరి ధాన్యపు రాసులు కురిపించే కుంభవృష్టి, పచ్చదనాన్ని కబళించి పొగతో ఉక్కిరిబిక్కిరి చేసే కార్చిచ్చు రెండూ ప్రకృతిలోంచి పుట్టినట్టుగానే. ఒకదాన్ని ఒకటి సమన్వయ పరుచుకుంటూ ఇంకా సృష్టి నిలబడేలా చేస్తున్నాయేమో! అలాగే మనలోనే మంచి చెడు ఒకదాన్ని ఒకటి సమన్వయ పరుచుకుంటూ మనిషి పతనం కాకుండా చూస్తుందేమో అనిపించింది. ముందు కాలాల్లో లాగా నల్లేరు మీద బండి నడక అయితే కాదు జీవితం. ఇన్ని ప్రలోభాల చుట్టూ మంచి చెడుల మధ్యన తీగపై నడిచే దొమ్మరాట లాగా ఉంది. ఎలా నెట్టుకుని వస్తామో వారి వారి విజ్ఞతను బట్టి. తూకం చెడిందా త్రాసు మొత్తం బోల్తాపడినట్టే ఇక.

ఆలోచిస్తూనే అపార్ట్మెంట్ కాంప్లెక్స్ కి వచ్చేసాము. ఈసారి బుర్రలో వేరే ఆలోచన లేకుండా మనస్ఫూర్తిగా అన్నాను శ్వేతతో " చాలా బాగా చేసావు శ్వేతా. మీ క్లాస్ నాకు చాలా నచ్చింది." అని.

అంతే ఒక్క మాట..ఆ చిన్న మాటకే ఎంత సంబరంగా నవ్విందో.. ఒకవైపుగా ఒరిగిపోతున్న నా తూకం కాస్త పైకి లేచినట్టుగా తోచింది. ఇహపై తూకం సరిచేసుకోవాలి. కిటుకు చాలా తేలికే కదా !

*(వచ్చేనెలలో అమెరికా అమ్మాయి ఏం చెబుతుందో.. ఎదురుచూద్దాం..!!)*

Post your comments